విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 18, డిసెంబర్ 2023

చివరి ఆయకట్టు రైతన్న నీటికి కటకటే

తెలుగుగంగ అధికారుల నిర్లక్ష్యం- రైతులకు శాపం
వందలాది ఎకరాల్లో ఎండుతున్న జొన్న పంట
19వ ఉప కాలువ చివరి ఆయకట్టుకు దక్కని సాగునీరు
ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతన్న

ఎండుముఖం పట్టిన జొన్నవంట


ఉపకాలవలో సాగునీరు లేకపోవడంతో పెరిగిన పిచ్చిమొక్కలు

విశాలాంధ్ర-రుద్రవరం: అధికారుల నిర్లక్ష్యం కారణంగా తెలుగు గంగ 19వ ఉపకాలువ చివరి ఆయకట్టు రైతులు సాగు చేసిన జొన్న పంటలకు సాగునీరు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 19వ ఉపకాలవ కింద వందలాది ఎకరాల్లో రైతులు జొన్న పంటను సాగు చేశారు. దాదాపు 20 కిలోమీటర్ల పొడవున గల తెలుగుగంగ పరిధిలోని 19వ ఉప కాల్వకింద అప్పనపల్లి,చిన్నకంబలూరు, బి.నాగిరెడ్డిపల్లె, చిలకలూరు, చందలూరు, మందలూరు గ్రామాలకు చెందిన రైతులు దాదాపు 2 వేల ఎకరాలపైగా జొన్న పంటసాగు చేశారు. తెలుగుగంగ ప్రధానకాలువ ద్వారా ఇప్పటికీ వారబంది పద్ధతితో 6 సార్లు తెలుగంగ అధికారులు సాగునీటిని విడుదల చేశారు. నీటిని విడుదల చేసిన ప్రతిసారి ఎగువ ప్రాంతంలో ఉన్న రైతులు కాలువకు అడ్డుగోడలు, గండ్లు కొట్టి సాగునీటిని చివరి ఆయకట్టు ప్రాంతంలోని తమ పంటలకు సాగునీరు రానివ్వకుండా నాయకులు చెరువుల్లో చేపల పెంపకం కోసం నీటిని మళ్ళించుకుంటున్నారు.దీంతో చివరి ఆయకట్టున ఉన్న పంట పొలాలకు సాగునీరు పారడం లేదు. దీంతో వేలాది రూపాయ లు పెట్టి బడులు పెట్టి జొన్న పంటను సాగు చేసిన రైతుల ముఖా లతో పాటు పంట లు కూడా వాడు ముఖం పట్టి ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు గత 20 రోజుల క్రితం ఎగువన ఉన్న రైతులతో మాట్లాడి అరకొరగా కొన్ని మీటర్ల పొడవున సాగు నీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఓతడి జొన్న పంటకు సాగునీరు అందింది. ప్రస్తుతము గత నాలుగు రోజుల క్రితం సాగునీటిని తెలుగంగ అధికారులు వదిలారు. ఈ నీరు 19 ఉపకాలువ ద్వారా కొన్ని కిలోమీటర్ల మాత్రమే పారి చివరి ఆయకట్టున ఉన్న రైతులకు ఒక చుక్క నీరు కూడా పారడం లేదు. దీంతో రైతులు సాగు చేసిన పంటలను ఎండ పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చివరి ఆయకట్టున ఉన్న 19 ఉపకాలవ రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకొని వాడిపోయిన పంటలకు ప్రాణం పోయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

ఒక్క తడి తడిస్తే చాలు-పార్థసారధిరెడ్డి, రైతు చిలకలూరు.

చివరి ఆయకట్టు రైతులకు తెలుగు గంగ అధికారులు సాగు నీరును ఒక్కతడి వదిలితే చాలు. మేము సాగు చేసిన జొన్న పంటలు పండిపోతాయి.అధికారులు చివరి ఆయకట్టుకు ఎగువనున్న రైతులతో మాట్లాడి కాలువలకు ఉన్న గండ్లు అడ్డుకట్టలను తొలగించి చివరి ఆయకట్టు రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సాబ్జి మరణం బాధాకరం

విశాలాంధ్ర-చాగలమర్రి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సాబ్జి మరణంబాధాకరమని యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షులు డెన్ని జాన్సన్, కోశాధికారి గౌస్‌లుఅన్నారు. ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ సాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సాబ్జీ అంగన్వాడీల సమ్మె శిబిరాలను సందర్శించి సంఘీభావం తెలిపి భీమవరం బయలుదేరే సమయంలో పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడ వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై మృతి చెందడం దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. 1990 లో యూటీఎఫ్‌లో ప్రాథమిక సభ్యునిగా చేరి జిల్లా కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర, జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నిక య్యారన్నారు. నిరంతరం ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేసే సాబ్జి మృతి ఉపాధ్యాయులకు తీరని లోటన్నారు.

నేడు జగన్ అన్నకు చెబుదాం - జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-నంద్యాల రూరల్ : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం (నేడు) నంద్యాల పట్టణం కలెక్టరేట్ లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో వినూత్న తరహాలో **'జగనన్నకు చెబుదాం - స్పందన'** కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జీలాని సమూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమానికి డిసెంబర్ 18 వ తేదీ ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు...అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా "జగనన్నకు చెబుదాం - స్పందన" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుండి కేసీ కాలువకు నీరు విడుదల

రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారులు గంగుల, ఎమ్మెల్యే నాని

విశాలాంధ్ర-చాగలమర్రి : నేటి నుండి కేసీ కాలుకు నీరు విడుదల చేయనున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిలు తెలిపారు.ఆదివారం చాగలమర్రిలోని మహబూబ్‌వలి కాలనీలోని వైసీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగావారు మాట్లాడుతు పంటలు ఎండిపోకుండా కాపాడేందుకే ప్రభుత్వం కేసీ ప్రధాన కాలువకు ఏడు రోజులపాటు సాగునీటిని విడుదల చేస్తున్నదన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గానికి సంబంధించి 16వ లాక్ నుండి నీటిని నీటిని విడుదల చేస్తామని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతన్నలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో 11 నియోజకవర్గ ఇన్చార్జిలను మార్పు చేయడం పట్ల తెలుగుదేశం నాయకులు చేస్తున్న విమర్శలను వారు తీవ్రంగా ఖండించారు. అది తమ సొంత పార్టీకి సంబంధించినదని, వచ్చే శాసనసభ ఎన్నికలలో విజయ అవకాశాలు ఉన్న అభ్యర్థులకే టికెట్లు ఇవ్వడంలో తప్పేమిటని వారు సూటిగా ప్రశ్నించారు. తమ నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ముందు నుంచే ఎన్నికల్లో గెలుపు అవకాశాల ఉండే అభ్యర్థులకే టికెట్లు ఇస్తామని ఆయన ప్రకటించారు అన్నారు. టికెట్లు రాని అభ్యర్థులు నిరాశ చెందకుండా ఉండాలని వారికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తప్పకుండా న్యాయం చేస్తారని వారు తెలిపారు. చంద్రబాబు నాయుడు ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను మార్చడం లేదా అని వారు సూటిగా ప్రశ్నించారు.తమ పార్టీ వ్యవహారాల్లో తల దూర్చడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. భవిష్యత్తు గ్యారెంటీ అంటూ తెలుగుదేశం నాయకులు ప్రజలకు మాయ మాటలు చెబుతూ మోసం చేసి తిరిగి అధికారంలో రావడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. 2014 నుండి 2019 వరకు చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలు ఎన్ని నెరవేర్చారో ప్రజలకు చెప్పాలని తెలుగుదేశం నాయకులకు సవాల్ విసిరారు. గత టిడిపి ప్రభుత్వంలో రైతు రుణమాఫీ, పొదుపు లక్ష్మీ రుణాలు మాఫీ చేస్తామని పత్రాలు ఇచ్చారని వాటి గురించి ఇండ్ల వద్దకు వచ్చే టిడిపి నాయకులను ప్రజలు ప్రశ్నించాలని అన్నారు. తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు చక్కగా అమలు చేయటం వలనే ప్రజల వద్దకు నిర్భయంగా వెళ్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేసిఎస్ కోఆర్డినేటర్ బాబులాల్, ఫయాజ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముల్లా జాబిర్, విద్యా కమిటీ చైర్మన్ లు అబ్దుల్లా, మాబుసున్న, వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు ముల్లా ఖాదర్బాషా, ముల్లా బురాందిన్, జల్సా గౌస్షేక్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భక్తుల రద్దీ

విశాలాంధ్ర-శ్రీశైలం : ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీశైల మహా క్షేత్రంలో ఆదివారం సెలవు రోజు కావడంతో అధికసంఖ్యలో భక్తులు శ్రీశైలం చేరుకుని తమ తమ మొక్కులు తీర్చుకుంటున్నారు అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలం చేరుకోవడంతో భక్తుల రద్దీక అనుగుణంగా ఆలయాధికారులు ఆలయ వేళలో మార్పులు చేశారు. సుమారు 60 వేలకు మంది పైగా భక్తులు స్వామి అమ్మవార్లు దర్శించుకున్నారని అంచనా.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర- కొలిమిగుండ్ల: మండలంలోని కొలిమిగుండ్ల కలవటాల గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో కొలిమిగుండ్లకు చెందిన రాజశేఖర్‌రెడ్డి ఆదివారం తీవ్రంగా గాయపడ్డాడు. పని నిమిత్తం రాజశేఖర్‌రెడ్డి కలవటాలకు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా రాంకో కొత్త రోడ్డు సమీపంలో బైకు అదుపుతప్పి కిందపడ్డాడు. రోడ్డుపై పడటంతో ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన రాజశేఖర్‌ను చికిత్స నిమిత్తం 108 నందు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్య చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది పవన్ గోపాల్,చంద్ర నాయక్ తెలిపారు.

తుఫాన్ నేపథ్యంలో అన్నదాతల్లో ఆందోళన

విశాలాంధ్ర-బనగానపల్లె: ఆంధ్రప్రదేశ్లో మరో తుఫాను ఉందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో అన్నదాతల్లో ఆందోళన నెలకొని ఉంది. నైరుతి బంగాళా ఖాతంలో ఉపరితల ఆవర్తన నేపథ్యంలో దక్షిణ కోస్తాలో రాయలసీమలో చెదురుముదురు వర్షాలు కురిసె అవకాశం ఉందని చెప్పడంతో అన్నదాతల్లో మరి ముఖ్యంగా వరి రైతుల్లో ఆందోళన నెలకొంది. వరిపంట కోతకు వచ్చిన నేపథ్యంలో ఏమాత్రం గాలివీచిన వరి ఒరిగే ప్రమాదం కొన్నిచోట్ల నూర్పిడి కొన్ని చోట్ల మిషన్లతో కోసి రాసిగా పోయడం జరిగింది. మీచంగ్ తుఫాన్ బీభత్సం మర్చిపోకముందే మరో తుఫాను ఉండడంతో వరి రైతులు ఎక్కడ నష్టం వాటిల్లుతుందో అని ఆందోళన చెందుతున్నారు.

జగన్ సర్కారును సాగనంపేందుకు ప్రజలు సిద్ధం

టీడీపీ ఇన్‌చార్జ్ ఎన్ఎండి ఫరూక్

విశాలాంధ్ర - నంద్యాల : జగన్ సర్కారును ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలుగు దేశం పార్టీ నంద్యాల అ సెంబ్లీ ఇన్‌చార్జ్ ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. 27వ వార్డు కౌన్సిలర్ దూదేకుల జైనాబీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఫరూక్ పాల్గొని దేవ నగర్ నందు ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల గురించి ప్రజలకు వివరించారు. చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకుంటే సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధి దూసుకెళుతుందన్నారు. ఎమ్మెల్యే శిల్ప రవి చేతకానితనం వల్లే నంద్యాలలో అభివృద్ధి కుంటు పడిందని ఆరోపించారు. మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఏవి సుబ్బా రెడ్డి మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు అధిక ధరలతో పాటు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దోచుకోవడం, దాచుకోవడం తప్ప జగన్ సాధించిందేమి లేదన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలన్నీ సర్వనాశమైయ్యాయని మరోసారి జగన్ మోసపు మాటలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని స్పష్టం చేశారు.కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, బీసీ నాయకులు దూదేకుల దస్తగిరి, దూదేకులబాబు, వెంకట సుబ్బయ్య, మహమ్మద్ తది తర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ తోనే భవిష్యత్తు

విశాలాంధ్ర - చాగలమర్రి: తెలుగుదేశం పార్టీతోనే ప్రజలకు భద్రత, భవిష్యత్తు ఉంటుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ భాష అన్నారు.మాజీమంత్రి భూమాఅఖిలప్రియ ఆదేశాల మేరకు ఆదివారం ఆయన స్థానిక 227 బూతులో బాబుషూరిటి భవిష్యత్తు గారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీలోని ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో మాటలు తప్ప పనులు ఏవి కాలేదన్నారు. పనికిరాని కార్పొరేషన్లు ఏర్పాటు వల్ల ఒరిగింది ఏమీ లేదు అన్నారు. రాబోవు ఎన్నికల్లో టిడిపి పార్టీకి మద్దతు పలికి భూమా అఖిలప్రియను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. తద్వారా నియోజకవర్గంలోని ప్రజల సంక్షేమ పథకాలు అన్ని నిరుపేదలకు అందుతాయన్నారు. కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి ముల్లా గఫార్, టీడీపీ నాయకులు ఆకుల ఇర్షాద్, నాగూర్ భాష, గంగుల భాస్కర్, రఫీ, దేవి తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి- సీనియర్ సివిల్ జడ్జి తంగమణి

విశాలాంధ్ర -డోన్ రూరల్: యువత డబ్బు వ్యామోహం వీడి సన్మార్గంలో నడవాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల దినోత్సవం ఆదివారం పెన్షనర్స్ భవనంలో అధ్యక్షులు భాను సింగ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తంగమణి మాట్లాడుతూ నేడు ఎక్కడ చూసినా వృద్ధులైన తల్లి దండ్రులపై దాడులు జరుగు తుండడం ఎంతో శోచనీయమని తెలిపారు. ఆస్తుల పంపకంలోనే కాకుండా తల్లిదండ్రుల పట్ల ప్రేమలు చూపాల్సిన బాధ్యత కుమారుల ,కుమార్తెలపై ఉందని తెలిపారు.

వృద్ధులు కోరుకునేది ఆప్యాయత మాత్రమే

వృద్ధులు తమ సంతానం నుండి కోరుకునేది కేవలంప్రేమ,ఆప్యాయత మాత్రమేనని శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ, పెన్షనర్స్ రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ అన్నారు. కన్న వారిని అనాధ శరణాలయాలలో వదలడం మంచి సంస్కృతి కాదన్నారు. భవిషత్తు తరాల వారికి మంచి చెడులు తెలపడానికి పెద్దలున్న ఇంటి వారు అదృష్టవంతులని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రాజేష్, ఎస్టీవో రఘునందన్,ఎస్‌బిఐ మేనేజర్ సచింద్రబాబు, ఏపీజీబీ జనరల్ మేనేజర్ జయదేవి, పెన్షనర్స్ అసోసియేట్ ప్రెసిడెంట్ మౌలాలి, హనీఫ్,గాలయ్య, దాసప్ప,గోపాల్, లోకనాథరెడ్డి రామదాసు రెడ్డి, కిషన్ సింగ్, పెన్షనర్స్ సభ్యులు పాల్గొన్నారు.

బిక్షాటన చేస్తూ అంగన్వాడీల నిరసన

చాగలమర్రి : బిక్షాటన చేస్తున్న అంగన్వాడి కార్యకర్తలు

డోన్:ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సమ్మె

వెలుగోడు : సమ్మెకు మద్దతు తెలుపుతున్న తల్లులు, పిల్లలు

విశాలాంధ్ర-చాగలమర్రి: కేరళ ఆసుపత్రి ఎదురుగా అంబేద్కర్ విగ్రహం వద్ద తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని గత ఆరు రోజుల నుంచి ఏఐటీయూసీ, సిఐటియు సంఘాల ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు నిరసన దీక్షలు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం స్థానిక అడ్డవాగు వద్ద ఏఐటీయూసీ నాయకురాలు చంద్రకళ,వహీదా,హసానమ్మ, ఇందుమతిలు, సిఐటియు నాయకురాలు పద్మావతి, నాగమణి, సంజమ్మ, వై పద్మావతి,వసంత ల ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు సహాయకులు భిక్షాటన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ చిన్నారుల పట్ల అంకితభావంతో పనిచేసినందుకు తాము చేస్తున్న దీక్షలకు మండలంలోని చిన్నారుల తల్లిదండ్రులు ఈరోజు వచ్చి మద్దతు తెలిపి సంఘీభావం తెలపడం సంతోషకరమైన విషయం అన్నారు. గత ఆరు రోజుల నుండి నిరసన దీక్షలు చేస్తున్న ప్రభుత్వంకు చీమకుట్టినట్లైనా లేదన్నారు. సమస్యలు పరిష్కరించేంతవరకు తమ పోరాటం ఆగదన్నారు. తమ నిరసన దీక్షలకు ప్రజల నుండి వివిధ ప్రజా సంఘాల నుండి రాజకీయ పార్టీల నుండి సంపూర్ణ మద్దతు లభిస్తోంది అన్నారు.కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడి కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

డోన్ : అంగన్ వాడి వర్కర్ల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి సరికాదని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ఆర్ సుగుణమ్మ, కో కన్వీనర్ జులేఖ లు హెచ్చరించారు.ఏఐటీయూసీ అనుబంధం అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆరవ రోజు సమ్మె చేశారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం దగ్గర ఏఐటియుసి డోన్ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్ అధ్యక్షతన ఆరవ రోజు నిరవధిక సమ్మె కొనసాగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి అంగన్వాడి వర్కర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియంతృత్వ ధోరణి విడనాడకపోతే ఇంటికి సాగనంపవలసి వస్తుందని వారు హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు ప్రతిపక్షనేతగా పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అంగన్వాడి వర్కర్లను దారుణంగా మోసం చేశాడని ఆరోపించారు. నిరవధిక సమ్మెను ఉధృతం చేయదానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయుసి నాయకులు రామ మోహన్ ,అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు

వెలుగోడు : వెలుగోడులో అంగన్వాడీలు , హెల్పర్లు తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా చేస్తున్న సమ్మెకు మద్దతుగా ఆదివారం అంగన్వాడీ ల సెంటర్ల నుండి పిల్లలు ,తల్లులు మద్దతు తెలపడం జరిగింది. ఈ సందర్భంగాకెవిపిఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి కే రామదాసు, వెలుగోడు సిఐటి మండల అధ్యక్షులు వి నాగమోహన్, వెలుగోడు అంగన్వాడీ టీచర్స్ సెక్టర్ నాయకురాళ్లు భాగ్యలక్ష్మి, అనిత, రవణమ్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి చర్చలకు పిలిచి కొన్నింటిని మాత్రమే ఆమోదించి మిగతా ముఖ్యమైన డిమాండ్లను ఆమోదించలేదన్నారు. పరిష్కరించలేని సమక్షంలో ఈ యొక్క సమ్మెను మరింత ఉధృతం చేస్తామని వారన్నారు. సమ్మెను పరిష్కరించకపోగా సచివాలయ ఉద్యోగస్తులను , అంగన్వాడి సూపర్వైజర్లను పంపించి మూసి ఉన్న అంగన్వాడి సెంటర్లను తాళాలు పగలగొట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ సమ్మెను త్వరగా పరిష్కరించాలని వారన్నారు.

గ్రామాల అభివృద్ధి వైసీపీ ప్రభుత్వంతోనే సాధ్యం

విశాలాంధ్ర-అవుకు: గ్రామాల అభివృద్ధి వైసీపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని సంఘపట్నం,రామాపురం గ్రామాల్లో రూ. 2.39 కోట్లతో నిర్మించిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు ఆదివారం ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ సెంటర్,జిల్లా పరిషత్ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం, సిసి రోడ్లను కాటసాని ఓబుల్‌రెడ్డి, జడ్‌పీటీసీ చల్లా శ్రీలక్ష్మిలతో కలసి వారు ప్రారంభించారు. అర్హులైన లబ్ధిదారులకు జగనన్న భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా పేద రైతులకు భూ పంపిణీ పట్టాలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడం జరుగుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకుల సొంత గ్రామాల్లో కూడా ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేయడం గొప్ప విషయమని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు భూపంపిణీ కార్యక్రమాన్ని చేపడుతుంటే తెలుగుదేశం పార్టీ నాయకులు చూసి ఓర్వలేక న్యాయస్థానాలకు వెళ్లి అడ్డుపడి పేద వారికి సొంత భూమి కూడా అందకుండా కోర్టుకు వెళ్లి అడ్డుపడడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. అలాంటి వారిని 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మళ్ళీ బుద్ధి చెప్పడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కాటసాని తిరుపాల్రెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, తహసిల్దార్ ప్రసాద్ బాబు, మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి, కాంట్రాక్టర్ మద్దయ్య, ఆర్డబ్ల్యూసీ కరీముల్లా, పంచాయతీరాజ్ ఏఈ రమణ, ఎంపిటిసి పేరం వెంకటసుబ్బారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, గిరి, సర్పంచ్ సువార్తమ్మ, రామారావు, రాము, మదన గోపాల్, ప్రమోద్, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటరీలు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల హామీకి కట్టుబడి ఉంటాం

విశాలాంధ్ర- నందికొట్కూరు: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ రాబోయే సార్వత్రిక ఎన్నికలలో అధికారం చేపడితే సూపర్ సిక్స్ పథకాలకు కట్టుబడి ఉంటామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గిత్త జయ సూర్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని శాతనకోటలో ఆపార్టీ నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, పార్టీ నందికొట్కూరు ఇంచార్జి గౌరు వెంకటరెడ్డి ఆదేశాల మేరకు బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా వారు గ్రామంలో ఇంటింటికి వెళ్లి తెలుగుదేశంపార్టీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, తిమ్మారెడ్డి, నారాయణ, వెంకటేశ్వర్లు, కాజా మియా, ఎంపీటీసీ చిన్న సుబ్బయ్య, గోవిందు, రవి, సలీం, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, భాస్కర్, శివ, రామకృష్ణ, అలిమ్ ముద్దిన్, ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సంఘాలను బలోపేతం చేయండి

విశాలాంధ్ర-పాణ్యం: పొదుపు గ్రామ సంఘాలను బలోపేతం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాం భూపాల్‌రెడ్డి అన్నారు.మండల కేంద్రం అయ్యపు రెడ్డి కాలనీలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి రూ.5 లక్షల నిధులు, పొదుపు మహిళల నిధులతో భారతి,విజయభారతిగ్రామ సంఘాలకు సంబంధించిన కార్యాలయ భవనాలకు ఆదివారం పూజ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ మహిళలు పొదుపు రుణాలతో ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పొదుపు మహిళలకు వడ్డీలేని రుణాలను ఇస్తూ వారిని ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ప్రసాద్,మండల ఎంపీపీ హుస్సేన్ బి, సర్పంచ్ మేకల పల్లవి,వైస్ ఎంపీపీ పార్వతమ్మ,వెంకటేశ్వర్లు కో-ఆప్షన్ సభ్యుడు జాకీర్ హుస్సేన్,సచివాలయాల కన్వీనర్ సుమంత్ రెడ్డి,వైసీపీ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, చందమామ బాబు, సీఐ వెంకటేశ్వరరావు,ఎస్ఐ అశోక్, అయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పొదుపు సీసీలు, వివోఎలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ఆటో ప్రమాద ఘటన దురదృష్టకరం

విశాలాంధ్ర - బనగానపల్లె: నంద్యాల పట్టణం నూనెపల్లె బ్రిడ్జి వద్ద శనివారం సాయంత్రం జరిగిన ఆటో ప్రమాదం దురదృష్టకరమని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. బనగానపల్లెకు చెందిన ఎగ్బాల్, ఆటో యజమాని బోయ భాస్కర్ మృతి చెందడం బాధాకరమన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఇరువురి భౌతికకాయాలు వారి స్వగృహాలకు చేరుకున్నాయి. విషయం తెలుసుకున్న బీసీ రాజారెడ్డి, బీసీ ఇందిరమ్మలు ఎగ్బాల్, బోయ భాస్కర్‌ల భౌతిక కాయాలు సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి భవిష్యత్తులో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, అత్తర్ కలాం, గోపాల్, విష్ణు వర్ధన్ రెడ్డి,షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

చెంచులకు టార్పాలిన్లు పంపిణీ

విశాలాంధ్ర-వెలుగోడు: వెలుగోడులో జగనన్నకాలనీ వద్ద గుడిసెలు వేసుకున్న చెంచులకు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఆదివారం టార్పాలిన్లు పంపిణీ చేశారు.ఆత్మకూరు ఆర్డీవో మిరియాల దాస్, సబ్ ఇన్స్పెక్టర్ వెంకట్ ప్రసాద్, లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్ కరస్పాండెంట్ డా.ఇమ్మానియేల్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చెంచులకు మౌలిక వసతులు అయినటువంటి రోడ్లు, తాగునీరు, ఇళ్ల నిర్మాణం కల్పిస్తామన్నారు. 51 మంది చెంచులకు టార్పాలిన్లు పంపిణీ చేసి, భోజన వసతి కల్పించారు. రెడ్ క్రాస్ సొసైటీ ప్రజలకు వైద్య, రక్తదాన శిబిరాలు, దుప్పట్లు, చీరల పంపి ణీ ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు దస్తగిరి పేర్కొన్నారు.

కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు మునిరుద్దీన్, నాగశేషులు, చాంద్‌బాషా, తిరుపాలు, శాలు బాషా, విఆర్వోలు చక్రపాణి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 18, డిసెంబర్ 2023

సోమవారం జరిగే రైతుసంగం మహాసభలకు సర్వము సిద్ధం తోరణాలు ఫ్లెక్షిలతో నిండిపోయిన సోమప్పసర్కిల్‌తో రాష్ట్ర నాయకులకు స్వాగతం పలుకుతున్న సీపీఐ ఎర్ర జెండాలు. -విశాలాంధ్ర -ఎమ్మిగనూరు.

ఆదర్శ మహిళా నేత చంద్ర రాజకుమారి

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: చంద్ర రాజకుమారి జీవితం మహిళా లోకానికి ఆదర్శమని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్. గిడ్డమ్మ, పి శ్రావణిలు చెప్పారు. అఖిలభారత మహిళా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షురాలు చంద్ర రాజకుమారి 5 వ వర్ధంతి కర్నూలు చంద్ర రాజేశ్వరరావు భవన్ లో ఆదివారం జరిగింది. ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.గిడ్డమ్మ, పి శ్రావణిలు చంద్ర రాజ్ కుమారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్ర రాజకుమారి చదువుకుంటున్న రోజుల్లోనే ఉద్యమాలవైపు ఆకర్షితరాలై విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు అని తెలిపారు. విద్యాపరంగా మెడిసిన్ చేసిన రాజ్ కుమారి వైద్య విద్య కూడా పూర్తి చేయకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా సమాఖ్య బాధ్యతలు తీసుకొని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేశారని చెప్పారు. ఆమె తుది శ్వాస విడిచే దాకా మహిళా సమైక్య గౌరవ అధ్యక్షురాలుగా ఉండి హైదరాబాదులో ని పార్టీ కార్యాలయం మగ్ధమ్ భవన్ నివాస ఉంటూ రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి మహిళా సమాఖ్యను బలోపేతం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నగర నాయకులు అమినాబి, వెంకటేశ్వరమ్మ, కేశమ్మ, పార్వతి, సాయి చందన, లీల, మునెమ్మ, రేవతి పాల్గొన్నారు.

మత్స్య కార్మిక సంఘ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర- కర్నూలు: మత్స కారుల 2వ రాష్ట్ర2 మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం రాజేశ్వరరావు భవన్ లో 'కరపత్రం'ను చేతి వృత్తి దారుల సమాఖ్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఏపీ మత్స్య కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శికె.రంగనాథ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా చేతి వృత్తి దారుల సమాఖ్య ఎ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామాంజనేయులు మాట్లాడుతూ చెరువులు, కుంటలుమొదలుకొని నదులు,రిజర్వాయర్లు,సముద్ర తీర ప్రాంతాల వరకు కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ,రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాలు ఆర్థిక విధానాల ఫలితంగా తరాలుగా సాంప్రదాయంగా చేపలు పట్టుకొని జీవిస్తున్న మత్స్యకారుల జీవితాలు ఏ మాత్రం మెరుగుపడకపోగా నరేంద్ర మోడీ అనుసరిస్తున్న బ్లూ ఎకానమీ ఆర్థిక విధానాల వల్ల సముద్ర లోతులో ఉన్న మత్స్య సంపద, సముద్ర తీరంలో ఉన్న ఇసుక, ఇతర సహజ వనరులను తన అనుంగు మిత్రుడు అదానీ వంటి కార్పొరేట్ కంపెనీలు దోచుకోవడానికి సముద్ర తీరంలోని ప్రధాన చిన్న, పెద్ద ప్రధాన చిన్న ఓడ రేవులను అప్పగించడమే కాకుండా సాంప్రదాయ వేటతో నేటి కొనసాగిస్తున్న మత్స్య కార్ల జీవితాలు అంధకారంలో లోకి వెళుతున్నాయి. అదేవిధంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో నేటి వరకు కుంటలు,చెరువులు రిజర్వాయర్లు,కాలువల వద్ద చేపలు పట్టుకుని జీవిస్తున్న మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే విధంగా మత్స్య కారులు సాధారణమైన వేలం పద్ధతిని మర్చి ఆన్ లైన్ వేలం ద్వారా వేలాన్ని వేసే విధంగా ప్రభుత్వ రాష్ట్ర ప్రభుత్వం రెండు జీవోలు తీసుకురావడం వల్ల నిరక్ష్య రాసులైన మత్స్యకారులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఆన్లైన్ వేలాలలో డబ్బున్న ధనవంతులు కారు చౌకగా వేలాలు దక్కించుకొని చేపలు పట్టే వృత్తిని వ్యాపారంగా మార్చుకొని చేపల వేట పై ఆధారపడిన మత్స్య కారులందరూ వృత్తులను వదిలి ఇతర వృత్తుల్లోకి ప్రమాదం ఉంది. మత్స్యకారుల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతున్నామన్న రాష్ట్ర ప్రభుత్వాల చేస్తున్న పథకాలు మత్స్య కార భరోసా, పక్కా ఇళ్లు, పెన్షన్లు, సబ్సిడీ రుణాలు వంటి సంక్షేమ పథకాలు తమ రాజ కీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటూ అర్హత ఉన్న మత్స్యకారులకు సంక్షేమ పథకాల అమలుకు నోచుకోవడం లేదు. మత్స్యకార సంఘాలు అనేక సంవత్సరాలనుండి పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను కూడా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుండా మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీస్తున్న రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా డిసెంబర్23న జరిగే ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం రెండవ మహాసభల్లో చర్చించి పోరాట కార్యక్రమానికి పొందించడం జరుగుతుంది. సంప్రదాయం గా తర తరాలుగా చేపల వేటతో వృత్తి ని కొనసాగిస్తున్న మత్స్యకారులు ఉపాధిని కాపాడుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్య కారులకు వ్యతిరేకంగా తీసుకొని వస్తున్న విధానాలను తిప్పికొట్టడానికి మహాసభల్లో మత్స్య కారులందరు అధిక సంఖ్యలో పాల్గొనాలని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమడలి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.నాగరాజు, జిల్లా నాయకులు హుస్సేన్, మాణిక్యం, మహిళా సమాఖ్య నాయకురాళ్లు పాల్గొన్నారు.

జిల్లా రైతు మహాసభలను జయప్రదం చేయండి

ఏఐకెయస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథం

విశాలాంధ్ర- కోడుమూరు: ఈనెల 18,19వ తేదీలలో జిల్లాలోని ఎమ్మిగనూరు పట్టణంలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా 10వ మహాసభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథం పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం పట్టణంలోని స్థానిక ఎఐటీయుసీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జగన్నాధం మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర సం గ్రామంలో పాల్గొని బ్రిటీష్ వారిని ఈ దేశం నుండి తరిమికొట్టడంలో దేశానికి స్వాతంత్రం సంపాదించడంలో అఖిల భారత రైతు సంఘం ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. 1936వ సంవత్సరంలో అఖిల భారత రైతు సంఘం ఏర్పడిందని, మొదటి అధ్యక్షులుగా సహజ నందా సరస్వతి,ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎన్జి రంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఆనాటి నుండి నేటి వరకు రైతు సమస్యల కోసం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పోరాడుతుందన్నారు. కర్నూలు జిల్లాలోని హంద్రీనీవా ప్రాజెక్ట్,అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్,గోరుకల్లు రిజర్వాయర్,పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణాలకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. పశ్చిమ ప్రాంతంలో వర్షాలు లేక రైతులు వేసిన పంటలు ఎండిపోయి కరవు వచ్చి రైతు కుటుంబాలు ఇప్పటికే పొట్ట చేత పట్టుకుని సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్ళిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.వలసలను ఆపడానికి పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలం చేయడానికి పెండింగ్ లోనున్న సాగునీటి ప్రాజెక్టులు వేదవతి ప్రాజెక్టు, ఆర్డిఎస్ కుడికాలువ నిర్మాణం, గుండ్రేవుల రిజర్వాయర్, హంద్రీనీవా ప్రధాన కాలువల క్రింద ఉన్న రిజర్వాయర్లు దగ్గర స్థిరీకరణ పనులు పంట కాలువల నిర్మాణం పూర్తి చేయాలని పోరాటం చేసిందన్నారు. హంద్రీనీవా ద్వారా 106చెరువులకు నీళ్లు నింపాలని పోరాటం చేసి సాధించుకోవడం జరిగిందన్నారు.పశ్చిమ ప్రాంతంలో కరువు శాశ్వితంగా దూరం చేయవచ్చని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం దశలవారీగా పోరాటాల నిర్వహిస్తున్నదని తెలిపారు.ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో వర్షాలు లేక రైతులు వేసిన పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయి,అప్పుల పాలైన రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనేక రకాల ఆందోళనలతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళిందని గుర్తు చేశారు.అలాగే జిల్లాలోని రైతులను సమీకరించి పెద్దఎత్తున కలెక్టరేట్ ను ముట్టడించగా ప్రభుత్వం దిగివచ్చి జిల్లాలోని 26మండలాలలో ప్రస్తుతం 24 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిందని తెలిపారు.తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని, నష్టపోయిన రైతులకు సబ్సిడీ ఎరువులు,90శాతం సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలని,ప్రభుత్వం ద్వారా వచ్చే ఎరువులు విత్తనాలు అందించాలన్నారు.బ్లాక్ మార్కెట్లో కల్తీ విత్తనాలు,కల్తీ ఎరువులను అరికట్టాలన్నారు.నాలుగు టీఎంసీలతో ఆర్డిఎస్ కుడికాలువ నిర్మాణం చేపట్టాలని, మంత్రాలయం,ఎమ్మిగనూరు నియోజకవర్గాలలో 40వేల ఎకరాలకు సాగునీరు,వందలాది గ్రామాలకు త్రాగునీరు కోసం ఎల్ఎల్సికి రావాల్సిన 650 కూసెక్కుల నీటి వాటా ఇవ్వాలని కోరుతూ దశలవారిగా పోరాటాల నిర్వహిస్తున్నదని చెప్పారు. జిల్లాలో రైతన్నల పోరాటాలను మరింత పదును పెట్టడానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కర్నూలు జిల్లా 10వ మహాసభలను సోమవారం నుంచి రెండు రోజుల పాటు ఎమ్మిగనూరులో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుండి వేలాది మంది రైతులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యద్శి రాజు,వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి శేషుకుమార్,ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు మధు,రైతు సంఘం నాయకులు రాముడు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంతా వన్ వే...ఆయన రూటే సపరేటు

భయభ్రాంతుల్లో తడకనపల్లె ప్రజలు



విశాలాంధ్ర - కల్లూరు: తప్పు ఒప్పు ఆయన కనుసందనాల్లోనే కనిపించనంత పరిస్థితుల్లో ఓ పోలీసు అధికారి మహిళలపై తప్పుడు కేసులు పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడని మహిళలు వాపోతున్నారు. తాను చెప్పిందే వేదం అంటూ అనుకున్నదే జరగాలంటూ తన రూటే సపరేట్ అంటూ గ్రామాల్లో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యే పరిస్థితులు చోటు నెలకొన్నాయి. ప్రజలకు ఏదైనా అన్యాయం జరిగినప్పుడు దేవుడు తర్వాత దేవుడు అంత వారని పోలీసు అధికారులను నమ్మి అన్యాయం జరిగిన ప్రజలు పోలీస్ స్టేషన్లకు కొండంత ఆశతో వెళ్లి వారి బాధలు వ్యక్తపరుస్తుంటారు. కొండంత ఆశతో వెళ్లిన ప్రజలకు నిరాశ ఎదురై వెళ్లిన వారి పైనే తప్పుడు కేసులు పెట్టే పరిస్థితులు మండలంలో చోటు చేసుకుంటున్నాయని ప్రజలు కన్నీరు మున్నీరవుతున్నారు. కల్లూరు మండల పరిధిలోని ఉలిందకొండ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఓ ఉన్నత పోలీసు అధికారి మహిళలను, బీదా, సాదా , తప్పు ,ఒప్పు అని చూడకుండా అప్పనంగా తప్పుడు కేసులను బనాయించి అధికార పార్టీకి కొమ్ముకాస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయా గ్రామాలలోని మహిళలు వాపోతున్నారు. సివిల్ పంచాయతీల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి కాసుల కురిపిస్తే ఎంతటి వారికైనా ఆ అధికారి అండగా నిలుస్తూ న్యాయ అన్యాయాలు లీగల్ ,ఇల్లీగల్ తార తమ్యం లేకుండా తప్పుడు కేసులు బనాయించి ఆయన చెప్పిన విధంగా ఒప్పుకోకపోతే జైలుకు వెళ్లాల్సి వస్తుందని బాధితులు వాపోతున్నారు. తడకనపల్లె గ్రామంలో పొదుపు సంఘం లో విధులు నిర్వహిస్తున్న మహిళల మధ్య గత కొంతకాలంగా వర్గ విభేదాలు చోటుచేసుకుని ఇంతింతై వటుడింతై అన్న చందాగా గొడవలు ముదిరి ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుని పరిస్థితులు నెలకొన్నాయి. ఘర్షణ ఒకలాగా ఉంటే కేసులు మరోలాగా ఉండటం చూసిన తోటి మహిళలు నిర్విర్య పోతున్నారు. గల్లి నుండి ఢిల్లీ దాకా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్న తడకనపల్లె పొదుపు మహిళల్లో రోజురోజుకు దేశరాగాలు చాప కింద నీరు లాగా విభేదాలు వ్యాపించి పంతాలకు పోయి తప్పుడు కేసులో సైతం ఒకరిపై ఒకరు పెట్టుకునే పరిస్థితులు నేడు గ్రామంలో దాపరించాయి. ఎదుగుదలను చూసి ఓర్వలేక తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఒకరిపై ఒకరు స్వార్థం పెంచుకొని రోజురోజుకు గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతున్నాయని ఎప్పుడు ఏ మహిళపై ఏ కేసులు ఏ దాడులు జరుగుతాయని భయభ్రాంతులకు గురవుతున్న పరిస్థితులు తడకన పల్లె ,వామసముద్రం, ఓబులాపురం తదితర గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండలంలోని స్వయం వృత్తిపై ఆధారపడి జీవన పోరాటం సాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న నాటి మహిళలు నేడు వాటికి విరుద్ధంగా ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుని అంధకారంలోకి వారి అభివృద్ధిని నెట్టివేసిన దశాబ్దాల పేరు ప్రఖ్యాతులు మంట కలిసిపోయిన పరిస్థితులు దాపరించాయి. నేడు మహిళల కుటుంబాలు స్టేషన్ల చుట్టూ తిరిగే పరిస్థితులు తడకనపల్లె గ్రామపంచాయతీలో చోటు చేసుకుంటున్నాయి.కొంతమంది అధికారులు వారిపై లేనిపోని తప్పుడు కేసులు పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మహిళలు కన్నీరు. అవుతున్నారు. ఒక మహిళకు ఓ ప్రజా ప్రతినిధి గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రత్యేక గుర్తింపు ఇవ్వడంతో జీర్ణించుకోలేని తోటి మహిళలు పట్టు పట్టి నిత్యం ఘర్షణలకు దారితీసి ఏదోలాగా వారి ఎదుగుదలను తుంగలో తొక్కి ఇబ్బందులకు గురి చేయాలని కుట్రలు పందుతున్నారని తనపై తన కుటుంబం పై ఇప్పటికే పలుమార్లు అట్రాసిటీ కేసులు పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఓ మహిళా వర్గం ఆవేదన వ్యక్తం చేస్తుంది. మరో మహిళా వర్గం తాను దశాబ్దాలుగా గ్రామంలో చాలీచాలని జీతంతో జీవనం సాగిస్తూ పొదుపు సంఘాల అభ్యున్నతికి ఎంతగానో పాటుపడుతునాననిన తన సేవలను విస్మరించి చిత్రహింసలకు గురిచేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం బాధాకరంగా ఉందని మరో వర్గం మహిళలు మండిపడుతున్నారు. జరిగిన గొడవలను పక్కన పెట్టి ఒకరిపై ఒకరు మహిళలు తప్పుడు కేసులు పెట్టుకుని వారు ఎదుగుదలను వారే చేతులారా నాశనం చేసుకుంటున్నారని తోటి మహిళలు వాపోతున్నారు. గొడవ ఒకలాగా జరుగుతే కేసులు మరోలాగా పెట్టుకోవడం చూసిన తోటి మహిళలు గ్రామాభివృద్ధి ఎటువైపు వెళుతుందో అర్థం కాక వారి బాధ ఎవరికి చెప్పుకోవాలో ఏ వర్గం వైపు వెళ్తే ఏమి జరుగుతుందోనని తమపై ఎప్పుడు ఏ కేసులు పెడతారో నని గ్రామంలోని మహిళలు భయభ్రాంతులకు గురవుతున్న పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. గ్రామంలో నడివీధుల్లోనే సారా మద్యం విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతుండడంతో నేటి యువత మద్యం సేవించి తాగిన మైకంలో మహిళలపై దాడులకు పాల్పడుతున్నారని తాగిన మైకంలో మరో ఇంటిలోకి దూరి మహిళలను బలాత్కారం చేయబోయిన పరిస్థితి గ్రామంలో చోటుచేసుకుందని ఇలా నిత్యం ఎప్పుడు ఏమి జరుగుతుందో అర్థం కాక ఏదైనా సమస్య జరుగుతే సంబంధిత అధికారులకు చెప్పుకుంటే న్యాయం జరుగుతుందనే పరిస్థితులు కూడా గ్రామంలో లేకపోవడం తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని మహిళలని చూడకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న ఆ ఉన్నత స్థాయి పోలీస్ అధికారి తీరు మారేలా చూడాలని మహిళలు కన్నీరు మున్నీరవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు తడకనపల్లె గ్రామంలో జరుగుతున్న పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించి మహిళలకు అండగా నిలవాలని వేడుకుంటున్నారు.

ఎస్సై నల్లప్ప వివరణ కోరగా : ఏ వర్గానికి కొమ్ము కాయడం లేదని, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకే విచారణ చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందని, తాను ఏడాదికాలం స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నానని ఏడు కేసుల వరకు అట్రాసిటీ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు . తాను తప్పుడు ప్రచారాలకు భయపడేదిలేదననారు.

సీఐటీయూ నుండి ఏఐటీయూసీలోకి చేరిక

విశాలాంధ్ర -ఆదోని రూరల్ : పట్టణంలో విద్యుత్ ఉద్యోగ కార్మికులు సిఐటియు సంఘం నుంచి ఏఐటీయూసీ సంఘంలోకి ఆదివారం ఎన్జీవోస్ హోమ్ సమావేశ మందిరంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) లోకి చేరడం జరిగింది. విద్యుత్ ఉద్యోగ కాంట్రాక్ట్ కార్మికులు సిఐటియులో నుండి ఏఐటీయూసీ లోకి చేరికపై ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మరియు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నవీన్ కుమార్ సురేష్‌లు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆదోని జనరల్ బాడీ బసవన్న గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, సురేష్ కుమార్‌లు విద్యుత్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటం సాగిస్తూ హక్కుల సాధనకై కృషి చేస్తామన్నారు. ఏఐటియుసి పట్టణ కార్యదర్శి వెంకన్న,ఏఐటీయూసీ నాయకులు రాజు,షేక్షావలి పాల్గొన్నారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా నాయకుల ఆధ్వర్యంలో ఏఐటీయూసీ నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది.గౌరవ అధ్యక్షులుగా అజయ్‌బాబు, అధ్యక్ష, కార్యదర్శి సత్యనారాయణ, రాణి,కోశాధికారిగా బసవన్నగౌడ్, ఉపాధ్య క్షులు కృష్ణమూర్తి, నాగేంద్రప్ప,రత్న కుమార్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు రాజశేఖర్, కాలప్ప,కృష్ణయ్య, హుసేని జాయింట్ సెక్రెటరీలుగా భాస్కర్, శంకర్, రాముడు, శ్రీనివాసులు,దస్తగిరి,చిన్న ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రాముడు, శేఖర్, షేక్షావలి, వేద వ్యాసముని, మహేశ్వర్ రెడ్డి,రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉపాధి నిధులతో సీసీ రోడ్లు ప్రారంభం

విశాలాంధ్ర-దేవనకొండ రూరల్: మండలం పరిధిలోని తెర్నేకల్‌లో మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశాలు మేరకు సీసీ రోడ్డులు వేశారు.ప్రభుత్వం ప్రతి మండలానికి రూ.60 లక్షలు కేటాయించగా అందులో తెర్నేకల్‌కు రూ.15 లక్షలు కేటాయించడంతో సర్పంచ్ మొగతాల్ అరుణ్ కుమార్ , మంత్రి గుమ్మనూరు జయరాంలకు ఎంపీపీ దాసరి లక్ష్మి దేవికి కృతజ్ఞతలు తెలిపారు.మండల నిధులతో పలుచోట్ల రోడ్లు, డ్రైనేజీలు వేయడానికి సహాయ పడాలని మండల అధ్యక్షులును కోరినట్లు సర్పంచ్ అరుణ్ తెలిపారు.చెప ఈరన్న, వాల్మీకి రాఘవేంద్ర, నాగన్న, యేసేపు,కోటిరెడ్డి, మాల సూరన్న గ్రామస్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమిష్టి కృతో ఏదైనా సాధ్యం

ఏపీయుడబ్ల్యూజే ఆధ్వర్యంలోనే జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు
ఆదోనిలో తాలుకా మహాసభలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

విశాలాంధ్ర- ఆదోని : జర్నలిస్టుల హక్కుల కోసం ప్రభుత్వాలతో నిరంతర పోరాటాలు చేస్తున్న ఏకైక యూనియన్ ఏపీయుడబ్ల్యూజే అని టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు అన్నారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ పక్కన కేజీఎన్ ఫంక్షన్‌హాలులో ఆదోని తాలుకా మహాసభ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, హుసేన్‌బాష అధ్యక్షతన జరిగింది. ముందుగా భీమాస్ సర్కిల్ నుండి ర్యాలీగా సభ ప్రాంగణం వరకు చేరుకున్నారు. గురుకృప డ్యాన్స్ గ్రూప్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్‌లు మదిరె భాస్కర్‌రెడ్డి, దేవేంద్రప్ప, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జీ మల్లప్ప, ఆర్‌సీసీ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, వంశీచైతన్య హాస్పటల్ చైర్మన్, జనసేన నాయకుడు రమేష్‌యాదవ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, ఏఐటీయుసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు వీరేష్, సీపీఐ, సీపీఎం పట్టణ కార్యదర్శులు సుదర్శన్, లక్ష్మన్న, సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాబీర్‌బాష తదితరులు పాల్గొని ప్రసంగించారు. జర్నలిస్టులంతా సమిష్టింగా వుంటే ఏదైనా సాధిస్తారాని, ఎన్నో వ్యయప్రయాసాలు పడి జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలను నిక్కచ్చిగా ప్రచురిస్తూ దాడులకు గురువుతున్న జర్నలిస్టుల కోసం ఏపీయుడబ్ల్యూజే పోరాటాలు ఎనలేనవని, యూనియన్‌లలోనే అతి పెద్ద యూనియన్ అని వక్తలు కొనియాడారు. ఆదోని తాలుకా వున్న జర్నలిస్టులకి ఏ కష్టమొచ్చిన మేము ముందుంటామని వక్తలు హామి ఇచ్చారు. వచ్చిన అతిథులను శాలువాలు కప్పి, మెమెంటోలతో సత్కరించారు. ఏపీయుడబ్ల్యూజే ఐజేయు నాయకులు నాగరాజు, కొండప్ప, జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, జిల్లా గౌరవ సలహాదారులు కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సుంకన్న, జిల్లా కోశాధికారి అంజి, జిల్లా ఉపాధ్యక్షులు ఆరేకల్‌దేవదాస్, స్వరూప్, డి.బాష, వీరేస్‌నాయుడుతో పాటు జిల్లా నాయకులను ఆదోని తాలుకా కమిటీ సభ్యులు శాలువాలు కప్పి, మెమోంటోలు అందజేసి సన్మానించారు. అనంతరం నూతనంగా ఎన్నికైనా ఆదోని తాలుకా కమిటీని సన్మానించారు.

ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి కోడుమూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బి భాగ్యరత్న

విశాలాంధ్ర -కోడుమూరు : రాజ్యాంగ బద్ధంగా మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా ఎన్నికైన, దళిత మహిళనైన నన్ను కేంద్రమంత్రి సాక్షిగా అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా అగౌరవపరిచి,అవమానించడం సబబు కాదని కోడుమూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బి భాగ్యరత్న అన్నారు. శనివారం కోడుమూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర సమావేశం సందర్భంగా సర్పంచుల పట్ల పోలీసులు అరెస్టు చేసిన తీరును, సర్పంచ్ ప్రోటోకాల్ పాటించని అధికారుల వైఖరిని ఖండిస్తూ ఆమె ఆదివారం తన నివాసంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంద్రయ్య,నాగేష్‌లతో కలిసి విలేకరులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యరత్న మాట్లాడుతూ కోడుమూరులో శనివారం జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభలో ప్రోటోకాల్ పాటించి వేదికపైకి మొట్టమొదటిగా సర్పంచ్‌ను ఆహ్వానించాల్సిఉండగా,తనను ఆహ్వానించకుండా అధికారులు నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించారనిపేర్కొన్నారు.అధికారులు సర్పంచుల అధికారాలను దుర్వినియోగం చేస్తూ ఇలాంటి చర్యలకు పాల్పడడం సరికాదన్నారు.ప్రోటోకాల్ పాటించని సంబంధిత అధికారులపై కలెక్టర్ శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.జిల్లాలోని సర్పంచులమైన మేమంతా కేంద్రమంత్రి గ్రామసభ కార్యక్రమానికి కేవలం గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించాలని కోరుతూ గ్రామ సర్పంచుల సంఘం అధ్యక్షుడు బిర్రు ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చేందుకు మాత్రమే అక్కడికి వచ్చామన్నారు. పోలీసులు అత్యుత్సాహంతో తమపై దాడిచేసి అరెస్టు చేయడం చాలా బాధాకరమన్నారు.అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8660కోట్లు తక్షణమే రాష్ట్రంలోని గ్రామపంచాయతీల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.కోడుమూరు గ్రామ పంచాయతీకి 2021-22వ సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం నిధులు కోటి 67లక్షలు రావాల్సి ఉండగా కేవలం ఇప్పటివరకు 52లక్షలు మాత్రమే వచ్చాయన్నారు.కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు కేటాయించిన 8660 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడం వల్లనే గ్రామాల్లో అభివృద్ధి లేదన్నారు. గతంలో కూడా గ్రామ పంచాయతీకి వచ్చిన 14వ ఆర్థిక సంఘం నిధులు కోటి 47లక్షలు కేవలం అధికారుల నిర్లక్ష్యం వల్లనే వెనక్కి వెళ్లాయని ఆమె గుర్తు చేశారు.ఎంఆర్పిఎస్ నాయకులు నాగేష్ మాట్లాడుతూ ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోకుంటే ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ భక్త కనకదాసు విగ్రహ ఆవిష్కరణ

విశాలాంధ్ర- మంత్రాలయం: మంత్రాలయం మండలం సుంకేశ్వరిలో శ్రీ భక్త కనక దాసు స్వామి విగ్రహ ఆవిష్కరణకు ప్రత్యేకంగా కురువ సోదరులు మంత్రాలయం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పాలకుర్తి తిక్కారెడ్డికి బాణసంచాలు పేర్చి,డప్పు వాయిద్యాలతో పూలమాలలతో ఘన స్వాగతం పలుకుతూ, గ్రామ ప్రజలు విగ్రహావిష్కరణ చేయించారు, అలాగే కురువ సోదరులకు శ్రీ భక్త కనకదాసు స్వామి అనుగ్రహం ఎల్లప్పుడూ వారికి ఉండాలని మరియు కురువ సోదరులు కలిసి మెలిసి అందరూ ఓకే సోదరుభావంతో ఉండాలని పాలకుర్తి తిక్కారెడ్డి కోరారు. కార్యక్రమంలో మాధవరం అమర్నాథ్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, చావిడి వెంకటేష్, భీమన్న,ఆచారి,చంద్ర, అబ్దుల్, బంద్రాల నరసింహులు, అయ్యన్న, ఎంకప్ప, చిన్నారెడ్డి,దస్తగిరి, చిదానంద, లింగప్ప, మరియు గ్రామ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

శ్రీ రాఘవేంద్రుడి సన్నిధిలో కర్నాటక రాష్ట్ర మంత్రి...

విశాలాంధ్ర- మంత్రాలయం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం తుంగభద్ర నది తీరాన వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాల యం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఆదివారం ఉదయం కర్నాటక రాష్ట్ర ఆహారం, పౌరసరఫరాల శాఖ మంత్రి వర్యులు కె.హెచ్.మునియప్ప కుటుంబ సమేతంగా విచ్చేశారు.వీరికి శ్రీ మఠం ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ పీఆర్వో హెరాన్నళ్ళి వ్యాసరాజ్ స్వామి వార్లు శ్రీ మఠం సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ ను దర్శించుకొని కుంకుమ అర్చన,మహా మంగళ హారతి చేపట్టారు.అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకొని విశేష పూజలు నిర్వహించారు. తదనంతరం శ్రీ మఠం పీఠాధిపతి పరమ పూజ్యులు శ్రీ సుభుధేంద్ర తీర్థ స్వామి వీరికి శ్రీ రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేష వస్త్రాం, పుష్ప, ఫల మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ద్వారపాలక ప్రకాశ్ స్వామి, హెడ్ కానిస్టేబుల్ ఆనంద్ రెడ్డి, కానిస్టేబుల్ రంగస్వామి, కర్నాటక రాష్ట్ర పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 18, డిసెంబర్ 2023

మోడీ హటావో దేశ్ కి బచావో ఉద్యమ నినాదం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : మోడీ హటావో దేశ్ కి బచావో ఉద్యమ నినాదంతో ఆందోళనలు చేపడతామని ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ తెలిపారు. అఖిలభారత కిసాన్ సభ ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల ముగింపు సందర్భంగా ఆదివారం కర్నూలులో ని సత్య ఇన్ రెసిడెన్సి లో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్, జాతీయ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్ల, కృష్ణ ప్రసాద్, తీగల సాగర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కె రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జరుగుతున్న అనేక రకాల పరిణామాలపై 26 రాష్ట్రాల నుండి హాజరైన ప్రతినిధులు మూడు రోజులపాటు సమావేశాల్లో చర్చించామన్నారు. దేశంలో రైతులతోపాటు కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు కూడా తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారన్నారు. మోడీ అధికారంలోకి వచ్చేనాటికే దేశంలో సంక్షోభం ఉందని, అయితే వీళ్ళు అధికారంలోకి వస్తే స్వామినాథన్ సిఫారసులు అమలు చేస్తామని, రైతుల రుణాలను మాఫీ చేస్తామని, యువతకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ఇలాంటి అనేక రకమైన వాగ్దానాలు ఇచ్చి బిజెపి అధికారంలోకి వచ్చిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చాక హామీలన్నీ వదిలి రైతులను దారుణంగా దగా చేసిందన్నారు. రైతుల అప్పులు పెరిగాయని, ఆత్మహత్యలు కూడా పెరిగాయని, దేశంలో లక్ష మంది పైనే రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. మరో మూడు లక్షల మంది కార్మికులు, కౌలు రైతులు 50వేల మంది చదువుకున్న యువకులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఇవి కేవలం ప్రభుత్వం చెప్పిన అధికారిక లెక్కలు మాత్రమేనని అయితే వీటికి తోడు దేశంలో మహిళలు, దళితులు, గిరిజనులు, అల్పసంఖ్యాక వర్గాలు బాధలు భరించలేక బలవుతున్నారన్నారు. ఇంతటి దుర్మార్గమైన పరిస్థితిని ప్రజలు ఎదుర్కొంటుంటే, వాటికి భరోసానివ్వడం పక్కనపెట్టి, ప్రజలు బయటికి రాలేని కరోనా లాక్ డౌన్ సందర్భంలో రైతులకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలను, కార్మికులకు వ్యతిరేకంగా కార్మిక కోడ్లను ఈ ప్రభుత్వం తీసుకొని వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాల పైన సంవత్సరం పైగా ఢిల్లీలో రైతు మహా ఉద్యమాన్ని సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నడిపామన్నారు. ఉద్యమ సమయంలో 750 మంది రైతులు చనిపోయారని, లిఖింపూర్ ఖేరి లో 5 మంది రైతులను ఒక విలేకరిని మొత్తంగా ఆరు మందిని ఒక మంత్రి కుమారుడు కారుతో గుద్ది చంపారని అయినా ఇప్పటికీ ఆ మంత్రిని కొనసాగిస్తున్నారన్నారు. రైతులకు మద్దతు ధర ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, రైతులు పంటలకు పెట్టిన ఉత్పత్తి ఖర్చు కూడా దక్కక ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఎలాంటి ఉలుకు పలుకు లేదన్నారు. ఇప్పుడు కొత్తగా స్మార్ట్ మీటర్లు తీసుకుని వచ్చి వాటిని పంటకు బిగించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొని వస్తే, ఏ రాష్ట్రం కంటే ముందే ఈ రాష్ట్రంలో అమలు జరిగిపోతోందన్నారు. కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ రైతు వ్యతిరేక ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని వాటికి తగిన గుణపాఠం నేర్పాలన్నారు. ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్ల మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 68 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అయితే నేటి ప్రభుత్వాలు అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాల కారణంగా వ్యవసాయం సంక్షోభంలోపడి నలుగుతోందన్నారు. వ్యవసాయ సంక్షోభం కారణంగా రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు అర్ధాకలితో ఆత్మహత్యల పరంపర కొనసాగుతోందన్నారు. 50 కోట్లు కూడా రైతులకు ఇవ్వకుండా, ఆదాని అంబానీలకు ఏజెంట్ గా మారిన మోడీ ప్రభుత్వం 50 లక్షల కోట్ల రూపాయలను కేవలం 100 కుటుంబాలకు దోచి పెడుతోందన్నారు. కార్పొరేట్లకు ఏజెంట్ గా మారి విద్వేష రాజకీయాలను మీదేసుకొని నడుపుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మోడీ హటావో దేశ్ కి బచావో అన్న నినాదంతో గ్రామస్థాయి నుండి దేశ స్థాయి వరకు వివిధ రూపాలలో ప్రచారాలు నిర్వహించి, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మరో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానించినట్లు వారు తెలిపారు.

వైఎస్ జగన్ అంగన్ వాడిలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

చెవిలో పులుపెట్టుకొని వినూత్న నిరసన తెలిపిన అంగన్వాడీలు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : వైఎస్ జగన్ అంగన్ వాడిలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అంగన్వాడీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. లలితమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టి న సమ్మె యధావిధిగా కొనసాగిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా ఆదివారం కర్నూలు నగరంలో 6వరోజు వినూత్న రీతిలో చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. లలితమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ లను జగన్ మోహన్ రెడ్డి విధులకు హాజరు కాకపోతే 10వ తరగతిలో ఉత్తీర్ణులను అంగన్వాడి టీచర్లుగా నోటిఫికేషను విడుదల చేస్తామని చెప్పడం చాలా సిగ్గుచేటని చెప్పారు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడి వర్కర్స్ న్యాయమైన సమస్యలను పరిష్కారం చేస్తామని, తెలంగాణ కన్నా 1000 అదనంగా ఇస్తానని చెప్పి ఇప్పుడు మంత్రివర్గం చర్చలకు పిలిచి ఒక్క రూపాయి కూడా అంగన్వాడీలకు పెంచమని చెప్పడం చాలా దారుణం తెలిపారు. జగనన్న ఏ హామీలు అయితే ఇచ్చారో ఆ హామీలు అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. పాదయాత్ర చేస్తున్న సమయంలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీనే వారు అడుగుతున్నారని హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. అంగన్వాడి ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్య అని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడి ఉద్యోగులకు గ్రాడ్యుటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెన్ఫిట్స్ 5 లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు. అంగన్వాడి ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని, ఈ రకమైన పద్ధతే కొనసాగితే రాబోవు కాలంలో ఇంటికి పంపడం ఖాయమని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలని, లేదంటే అన్ని రాజకీయ పార్టీలను విద్యార్థి యువజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షురాలు పి.నిర్మల, సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ. ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు, సిఐటియు నగర అధ్యక్షులు నరసింహులు, కామేశ్వరి, బాలదుర్గమ్మ, నాగమణి, మహేశ్వరి, చౌడేశ్వరి, సునంద, రాధిక పాల్గొన్నారు.

బాలోత్సవ్ విజేతలకు అభినందన సత్కారం

విశాలాంధ్ర - నంద్యాల: గుంటూరు నగరం నంబూరు నందు నిర్వహించిన వివిఐటి బాలోత్సవ్ 2023 పోటీల్లో శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు నేషనల్ లెవెల్ నందు ఏకంగా 41 బహుమతులు సాధించిన సందర్భంగా పాఠశాల ఆవరణలో అభినందన సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డా.పి దస్తగిరి రెడ్డి, డా. జి. రామకృష్ణారెడ్డి, రవికృష్ణ, డైరెక్టర్ మౌలాలిరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో 60 విభాగాల నందు 605 పాఠశాలల నుండి 16 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని, రాయలసీమలో అత్యధిక బహుమతులు సాధించిన ఒకే ఒక్క పాఠశాల శ్రీ గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అన్నారు. ప్రవేశించిన ప్రతి విభాగంలో అత్యధిక బహుమతి సాధించినట్లుగా డైరెక్టర్ పి షేక్షావలిరెడ్డి తెలిపారు. విద్యార్థుల విజయాలకు కృషిచేసిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు మనోహర్ రెడ్డి, శివకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

విశాలాంధ్ర-చాగలమర్రి : జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని చాగలమర్రిలో ఆదివారం రిటైర్డ్ ఉద్యోగులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డికెనకార చిత్రపటా నికి పూలమాల వేసి ఘన నివాళులుఅర్పించారు. అనంతరం పెన్ష నర్ల సంఘం అధ్యక్షుడు పోలిశెట్టి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ సౌకర్యం కోసం 1982 డిసెంబరు 17న జస్టిస్ చంద్రచూడ్ ఇచ్చిన తీర్పుతో పెన్షనర్లకు భద్రత కలిగిందన్నారు. ఆ తీర్పు కోసం శ్రమించిన దివంగత డీఎస్ నకారా జ్ఞాపకార్థం పెన్షనర్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. పెన్షనర్ల డిఏ బకాయిలు, పిఆర్సి ఏరియర్స్‌ను వెంటనే ప్రభుత్వం చెల్లించాలన్నారు. అలాగే 2018 తర్వాత పదవి విరమణ చెందిన వారి గ్రాట్యూటీ, కమ్యూటేషన్ వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం గౌరవాధ్యక్షుడు కృష్ణమూర్తి, పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు, యం వి సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి మోహన్, కోశాధికారి రంగయ్య, పెన్షనర్లు నరసింహారెడ్డి, అన్నా సత్యనారాయణ, జివి సుబ్బారెడ్డి, విజయరాజు, భగవాన్, గుత్తిపుల్లయ్య, జబ్బార్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట నారాయణ, వెంకట్‌రెడ్డి, ఉషారాణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ బ్యాడ్మింటన్ టీం కోచ్‌గా సయ్యద్

విశాలాంధ్ర - బనగానపల్లె : అసోసియేషన్ ఇండియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వారు నిర్వహిస్తున్నటువంటి బ్యాడ్మింటన్ పోటీలలో రాయలసీమ విశ్వవిద్యాలయానికి చెందిన బ్యాడ్మింటన్ టీం కి బనగానపల్లె చెందిన సయ్యద్ కోచింగ్ గా వ్యవహరిస్తున్నారు. ఆదివారం శిక్షణ శిబిరం ముగించుకొని చిత్తూరు జిల్లాలో వేలూరులోని వేలూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఈనెల 19 వ తేదీ నుండి 24 వరకు జరిగే బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటున్నటు సయ్యద్ తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - నంద్యాల: నంద్యాల జిల్లా దూదేకుల సంఘం నూతన కమిటీని ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా వాసవి దస్తగిరి, ప్రధాన కార్యదర్శిగా గోల్డ్ దస్తగిరి, కోశాధికారిగా హుస్సేనప్పలు ఎంపికయ్యారు. దూదేకుల పత్రిక నూరు వాయిస్ మాసపత్రిక తొలి సంచిక విడుదల చేసినను దూదేకుల నాయకులు విడుదల చేశారు. స్థానిక నూర్ నర్సింగ్ హెరామ్ ఆవరణంలో జరిగిన నంద్యాల జిల్లా దూదేకుల విస్తృత స్థాయి సమావేశంలో దూదేకుల సంఘం జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగిందని రాష్ట్ర నాయకులు డాక్టర్ బాబన్, డాక్టర్ దస్తగిరి పర్ల తెలిపారు. నంద్యాల జిల్లా దూదేకుల సంఘం గౌరవాధ్యక్షులుగా బనగానపల్లెకు చెందిన డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, అధ్యక్షులుగా నంద్యాల వాసవి దస్తగిరి, ప్రధాన కార్యదర్శిగా గోల్డ్ దస్తగిరి, కోశాధికారిగా హుస్సేనప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ గా సంజామల మాజీ జడ్పిటిసి చిన్నబాబు, క్రాంతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డోన్ అబ్దుల్లా, నంద్యాల డిజిటల్ దస్తగిరి తదితరులు ఎన్నికయ్యారు.

సోమవారం జరిగే రైతుసంగం మహాసభలకు సర్వము సిద్ధం తోరణాలు ఫ్లెక్సీలతో నిండిపోయిన సోమప్పసర్కిల్‌తో రాష్ట్ర నాయకులకు స్వాగతం పలుకుతున్న సీపీఐ ఎర్ర జెండాలు.
-విశాలాంధ్ర -ఎమ్మిగనూరు.

బలిజ సంఘం తోనే పేద బలిజలకు న్యాయం

విశాలాంధ్ర-అవుకు: అవుకు పట్టణంలో బలిజ సంఘం ఏర్పడిన తర్వాతనే పేద బలిజలకు న్యాయం జరుగుతుంది అని బలిజ సంఘం అధ్యక్షుడు కునుకుంట్ల రామన్న అన్నారు. అవుకు పట్టణంలో గత ఆదివారం జరిగిన జగనన్న భూమి పంపిణీ కార్యక్రమంలో పట్టణంలోని పేద బలిజలకు బనగానపల్లి శాసనసభ్యుడు కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా భూ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో బలిజ కులస్తురాలు దండు మాధవి తనకు బలిజ సంఘం సహకారం వలననే భూమి లభించింది అని సభా పూర్వకంగా కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దండు మాధవిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు భూములు రావడం చాలా సంతోషంగా ఉందని బలిజ సంఘం ఏర్పడిన తర్వాతనే బలిజలకు మంచి గుర్తింపు వచ్చింది అని పేద బలిజలను గుర్తించి వారికి భూములు ఇప్పించడంలో బలిజ సంఘం ముందుండి భూములను ఇప్పించారని అన్నారు. బలిజలకు ఏ సమస్య వచ్చినా సంఘం వారికి చెప్పుకుంటే తగిన సహాయాలు చేయడంలో ముందున్నారని ఇటువంటి సంఘం ఏర్పడినందుకు మేమందరము ఎంతో ఆనంద పడుతున్నామని అన్నారు. భూమి పంపిణీ కార్యక్రమంలో బలిజ సంఘం చేసిన అభివృద్ధి మరియు సేవల గురించి ఎంత మాట్లాడినా తక్కువే అవుతుందని ఆమె అన్నారు. మండలంలో బలిజ కులస్తులు ఎవరు చనిపోయిన ఆ కుటుంబ సభ్యులకు ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించడం చాలా గొప్ప విషయమని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు రామన్న, వైస్ ప్రెసిడెంట్ ఆల్వా కృష్ణమూర్తి, జాయింట్ సెక్రెటరీ వేటూరి రమణ, ట్రెజరీ జక్కా మధు, కళాధర్, కోన మురళి, కరిమిశెట్టి మధు కృష్ణ, దొర్నిపాడు నాగరాజు మరియు బలిజ బంధుమిత్రులు పాల్గొన్నారు.

ఉచిత వినికిడి వైద్య శిబిరం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : మండల కేంద్రమైన కోవెలకుంట్లలో ఆదివారం చెవుడు ఉన్నవారికి కర్రా సుబ్బారెడ్డి ఫౌండేషన్‌ఆధ్వర్యంలో ఉచిత వినికిడి వైద్య పరీక్షలు కృష్ణ స్పీచ్,హియరింగ్ సెంటర్ కర్నూల్ వారిచే నిర్వహించటం జరిగినది. ఈ వైద్య శిబిరం లో కర్రా సుబ్బారెడ్డి ఫౌండేషన్ చైర్మెన్ కర్రా తేజ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా పేదలకు దుప్పట్లు, వికలాంగులకు మూడు చక్రాల సైకిల్ లు, ఊత కర్రలు, పేద విద్యార్థు లకు బుక్స్ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు మరియు ఈ సంవత్సరము వినికిడిలోపంతో బాధపడుతున్న పేదలకు వినికిడి పరీక్షలు నిర్వహించి వినికిడి మిషన్ లు త్వరలో పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. మరియు చెవిలో చీము నెత్తురు కారటం సమస్య ఉన్నవారికి వై యస్ ఆర్ ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితముగా ఆపరేషన్ లు ఏ ఖర్చు లేకుండా నిర్వహిస్తామని తెలిపారు. ఆడియోలోలోజిస్ట్ బి శివ కృష్ణ మాట్లాడుతూ ఈ పరీక్షలు ప్రైవేట్ హాస్పటల్ లో చూపించటానికి రూ. 1,000 నుండి రూ. 1,500 మరియు వినికిడి మిషన్ లు ?4000/- నుండి ?7000/- ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత చైర్మెన్ డాక్టర్ టి వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ కర్రా సుబ్బారెడ్డి ఫౌండేషన్ చైర్మెన్ తెజవర్ధన్ రెడ్డి గారికి కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలిపారు. మరియు భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటానికి తమ వంతు సహకారం అందించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో మానవత వైస్ ప్రెసిడెంట్ బి రామచంద్ర రాజు, సెక్రటరీ కె రామసుబ్బారెడ్డి, సభ్యులు జీ సహదేవ రెడ్డి, వై మురళీ మోహన్ రెడ్డి, జీ వెంకట సుబ్బారెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - నంద్యాల: ఐఎంఏ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణ పిజి కళాశాల ఆడిటోరియంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. నంద్యాల ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ వసుధ అధ్యక్షతన నిర్వాహక కమిటీ సభ్యులు వైద్యులు ఫ్రాంక్ మోహన్, కిషోర్, సచిన్ సుమంత్ నిర్వహణలో జరిగిన ఈ ఉత్సవాలకు ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుల ఫోరం చైర్మన్ డాక్టర్ జి. రవికృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన ఈ వేడుకలలో డాక్టర్ సచిన్ సుమంత్, డాక్టర్ కిషోర్ బృందం, కిరణ్ కీబోర్డ్ పై అందించిన సంగీత సహకారంతో ఆలపించిన క్రిస్మస్ కరోల్స్ పాటలు ఆహుతులను అలరించాయి. నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల మెడిసిన్ శాఖ అధిపతి, ప్రొఫెసర్ డాక్టర్ మదన్ క్రిస్మస్ పర్వదిన సందేశాన్ని అందించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ ఐఎంఏ నంద్యాల భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిందన్నారు. సంక్రాంతి సంబరాలు, రంజాన్ ఇఫ్తార్, క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకోవడం వైద్యుల ఐకమత్యానికి దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఐఎంఏ వైద్యులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ వసుధ, రాణి ప్రమీల, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ కిషోర్ తదితర వైద్యులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

విజయవంతమైన ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - నంద్యాల: నంద్యాల జమీయత్ ఉలమా అధ్యక్షుడు మౌలానా ఖలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, టిడిపి నంద్యాల ఇంచార్జ్ ఎన్ఎండి ఫారుక్, మౌలానా మహబూబ్ బాషా పాల్గొని మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో నంద్యాలకు చెందిన ప్రముఖ వైద్యులు పాల్గొని ప్రజలకు ఉచిత వైద్యం చేసి మందులను అందించారు. దాదాపుగా 300 మందికి పైగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మౌలానా ఖలీల్ అహ్మద్ చేసే సేవా కార్యక్రమాలను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని మనస్పూర్తిగా కోరారు. కార్యక్రమంలో ప్రముఖము వైద్యులు డాక్టర్ సంజీవ, డాక్టర్ వరప్రసాద్ డాక్టర్ శ్యామల, డాక్టర్ షమీముల్లా, డాక్టర్ విల్సన్ డాక్టర్ రాఘవేందర్ రెడ్డి, జమీయత్ ఉలమా కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూ మత వ్యాప్తికి మాలాధారులు కృషి చేయాలి

నంద్యాల బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు

విశాలాంధ్ర - నంద్యాల: హిందూ మత వ్యాప్తికి మాలాధారులు కృషి చేయాలని నంద్యాల బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు పేర్కొన్నారు. హిందూ మత పరిరక్షణ కోసం, దళిత,బడుగు వర్గాల్లో చైతన్యం తీసుకోవడానికి భద్రావతి భావనారుషి ఆలయంలో భవాని పూజ ఏర్పాటు చేశారు. హిందూ మత ప్రాముఖ్యతను చాటి చెప్తూ , కనక దుర్గ అమ్మవారి మాలను ధరించారు దళిత బిడ్డలు. ఆలయంలో అమ్మవారికి సంప్రదాయంగా, భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, బిజెపి ఇన్చార్జి అభిరుచి మధు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సహదేవుడు, సీనియర్ జర్నలిస్టు జనార్దన్ రెడ్డి ప్రజల్లో పాల్గొన్నారు. అనంతరం భవాని పూజ ఆర్గనైజర్ ఆర్ఎస్ఎస్ నేత చింతలపల్లి వాసు గురు స్వాములను, ప్రముఖులు సన్మానించారు.

విద్యతో పాటు క్రీడాల్లోను రాణింపు

విశాలాంధ్ర-గోనెగండ్ల: ఏపి మోడల్ స్కూల్ విద్యతో పాటు క్రీడా రంగంలో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో ఉందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ షాహినా పర్వీన్‌లు పేర్కొన్నారు. అదివారం ఏపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ షాహినా పర్వీన్ మాట్లాడుతూ ఇటీవల ఛత్తీస్గఢ్ లో 42వ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్షిప్ ఏపి కి చెందిన 11మంది టీం లో మన ఏపి మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి టీ.నరేంద్రనాయుడు అక్టోబర్ 15-19 వరకు జరిగిన జాతీయ స్థాయి పోటీ లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. జూనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థి సి.మహేంద్ర ఈ నెల 14న గుంటూరు జిల్లా నరసరావుపేట లో జరిగిన 4x400 ఎస్ జి ఎఫ్ స్టేట్ మీట్ రిలే లో ప్రథమ స్థానంలో కైవసం చేసుకున్నారు. కె.గణేష్ ఆచారి (జూనియర్ ఇంటర్) ఈనెల 11న ఏలూరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎస్ జి ఎఫ్ స్టేట్ మీట్ త్రోబాల్ పోటీ లో ప్రథమ స్థానం సాధించి, తిరిగి ఈనెల 26న ఢీల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బోతున్నామని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈతపోటీలకు జిల్లా క్రీడాకారులు

విశాలాంధ్ర- కర్నూలు లీగల్ : బెంగళూరులో ఈనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న సౌత్ జోన్ స్విమ్మింగ్ కాంపిటీషన్ కు జిల్లా స్విమ్మింగ్ క్రీడాకారులు ఎంపికయ్యారు. పల్నాడు డిస్ట్రిక్ట్ నరసరావుపేటలో 16,17 తేదీల్లో నిర్వహించిన 9వ సబ్ జూనియర్, జూనియర్ వింటర్ అక్వాటిక్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్షిప్ పోటీల్లో కర్నూల్ స్విమ్మింగ్ క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులు 7 గోల్డ్, 6 సిల్వర్, 7 బ్రాంజ్ మొత్తం 20 పతకాలు సాధించి జయగతనం ఎగురవేశారు. ఇందులో ఎ.భువనాదిత్య 1500 మీటర్ల ఈవెంట్లో గోల్డ్, వై.దేవశ్రుత్ సాయి 200 మీటర్స్ బ్రెస్ట్ స్ట్రోక్, 800, 400 మీటర్స్ ఫ్రీ స్టైల్, 200 మీటర్స్ ఐఎంలో గోల్డ్ మెడల్, 100 మీటర్స్ బ్రెస్ట్ స్ట్రోక్ లో బ్రాంజ్ మెడల్, సామియా తస్నీం 200 మీటర్స్ బటర్ ఫ్లై, 400 మీటర్స్ ఐఎం ఈవెంట్స్ లో గోల్డ్ మెడల్స్, 50,100 మీటర్స్ బటర్ఫ్లై50మీటర్స్ ఫ్రీ స్టైల్ ఈవెంట్స్ లో సిల్వర్ మెడల్స్, కే శృతి 400,200 మీటర్స్ ఫ్రీ స్టైల్ లో సిల్వర్ మెడల్, 100 మీటర్స్ బ్యాక్ స్ట్రోక్ లో బ్రాంజ్ మెడల్, ఎం మౌనిక 50 బ్యాక్ స్ట్రోక్ లో సిల్వర్ మెడల్, 50,100 మీటర్స్ బ్రెస్ట్ స్ట్రోక్ లో బ్రాంజ్ మెడల్ , కే అనిల్ 200 మీటర్స్ బ్యాక్ స్ట్రోక్ లో బ్రాంజ్, కె మనిష్ అశ్విన్ 200 మీటర్స్ బ్రెస్ట్ స్ట్రోక్ లో బ్రాంజ్, టి. వెర్షిక 50 మీటర్స్ బ్రెస్ట్ స్ట్రోక్ లో బ్రాంచ్ మెడల్స్ సాధించారు. విజేతలకు నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఏపీ ఈతసంఘం కార్యదర్శి ఎ.మోహన్ రామ్ మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా డీఎస్‌డీవో జి.సురేష్ స్విమ్మింగ్ కోచ్ ఎ.నట రాజ్, పాల్గొని విజేతలను అభినందించారు.

ఆళ్లగడ్డలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలో ఆదివారం యేసే నా రక్షకుడు మినిస్ట్రీస్ పాస్టర్, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ నాయకులు ఎద్దుల జోసెఫ్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సమీపంలో చర్చి ఆవరణంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ చీఫ్ విప్ గంగుల ప్రభాకర రెడ్డి గారు హాజరై క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేసు క్రీస్తు అడుగు జాడల్లో నడవడమే నిజమైన క్రిస్మస్ అని తెలిపారు. మన ముఖ్య మంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి పాస్టర్లకు గౌరవ వేతనం అందించి అన్నివిధాల ఆదుకున్నారు అన్నారు. అనంతరం పాస్టర్ జోసెఫ్ మాట్లాడుతూ బి"ఆళ్లగడ్డ లో క్రైస్తవులకు బరియల్ గ్రౌండ్ కోసం ఎమ్మెల్యే ను అడగడం జరిగిందనీ ఆయన సానుకూలం గా స్పందించి ముఖ్యమంత్రితో మాట్లాడి క్రైస్తవుల కు బరియల్ గ్రౌండ్ అవసరమని ప్రభుత్వం ద్వారా స్థలం కొనుటకు నిధుల కోసం చొరవ చుపారన్నారు. క్రైస్తవులకు రావలసిన హక్కుల కోసం పోరాటం చేస్తామన్నారు. అందుకు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం క్రిస్మస్ పాటలతో దైవ సేవకుల సందేశాలతో సెమీ క్రిస్మస్ వెడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ విశ్వాసులు, మహిళలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, దైవజనులు, భారీ ఎత్తున పాల్గొన్నారు.